క్లుప్తంగా

జ్ఞాన సమాజానికి కృషి చేద్దాం



సమావేశంలో స్వేరో సభ్యులు

పరిగి: జ్ఞాన సమాజానికి కృషి చేయడమే తమ లక్ష్యమని స్వేరో కోర్ స్టేట్ చీఫ్ బాబునాయక్ అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో స్వేరో నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజం కోసం పాటు పడే స్వేరో వారియర్స్‌ను తయారు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలోని 33 జిల్లాలు తిరిగి స్వేరో కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వేరో రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్నాపూర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు రాజేష్, సభ్యులు నరేందర్, రాజు, శ్రీనివాస్, సుధాకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించండి



ఏఈకి ఫిర్యాదు చేస్తున్న స్టేషన్‌ధారూరు గ్రామస్తులు

ధారూరు: గత మూడు రోజుల నుంచి రాత్రిళ్లు కరెంట్ సరఫరా లేక చిమ్మ చీకట్లో గడుపుతున్నామని మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు గ్రామస్తులు సోమవారం ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ధారూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏఈని కలిసి తమ గోడును వినిపించారు. స్థానికంగా ఉండే లైన్‌మెన్ ఫోన్ చేసినా స్పందన కరువైందని వాపోయారు. రోజు రాత్రిపూట కరెంట్ పోవడంతో దోమ విజృంభిస్తున్నాయని పేర్కొన్నారు. తక్షణమే విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని కోరారు.

నాలుగు లైన్ల రహదారితో తీవ్రంగా నష్టపోతాం

పోలెపల్లి గ్రామస్తులు



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన పోలెపల్లి గ్రామస్తులు

అనంతగిరి: నాలుగు లైన్ల రహదారితో తాము తీవ్రంగా నష్టపోతున్నామని దుద్యాల మండలం పోలెపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం వేయాలనుకున్న నాలుగు లైన్ల రోడ్డుతో తమ ఇళ్లు పోతాయన్నారు. ప్రస్తుతానికి రెండు లైన్ల రోడ్డు వేస్తే బాగుంటుందని తెలిపారు. ఇటీవల రూ.లక్షల్లో అప్పులు చేసి కొత్తగా ఇళ్లు నిర్మించుకున్నామని, ఇప్పుడు నాలుగు లైన్‌ల రోడ్డు వెడల్పుతో అవి పోతాయని వాపోయారు. విషయంలో కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

డిమాండ్ ఉన్న పంటలతోనే మేలు

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేందర్‌గౌడ్

చేవెళ్ల: రైతులు ముందుగానే మార్కెట్‌లో డిమాండ్లను పరిశీలించుకొని పంటలు సాగు చేస్తే నష్టాలను నివారించుకునే అవకాశం ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే రాజేందర్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మార్కెట్ కార్యాలయం వద్ద సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకుంటేనే రైతులకు మేలు జరుగుతుందని, దీనిని రైతులు గమనించేలా అవగాహన కల్పించాలన్నారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండలంలోని గుండాల, కమ్మెట తదితర గ్రామాల్లో సమస్యలపై విద్యుత్ ఏడీ, ఏఈలతో చర్చించి పరిష్కరించాలని సంఘం తరపున కోరామన్నారు. రాబోయే బలరామ జయంతి రోజు రైతు దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని సమావేశంలో చర్చించారు. విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఏఈకి వినతిపత్రం సైతం అందజేశారు. రైతుల సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ఎప్పుడు పోరాడుతుందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కోశాధికారి పెంటారెడ్డి, మండల కార్యదర్శి విశ్వనాథం, గుండాల, కుమ్మెర, కమ్మెట గ్రామలకు చెందిన రైతులు, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.

పశువుల బీమా అందేనా?

- మూగజీవాలు మృతి చెందితే నష్టపోతున్న పోషకులు
- అవగాహన కల్పించని అధికారులు

దౌల్తాబాద్: పశువుల బీమా అమలు కాకపోవడంతో పోషకులు తీవ్రంగా నష్టపోతున్నారు. వ్యవసాయానికి అనుబంధమైన పాడిపరిశ్రమను పెంచేందుకు దోహదపడే ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు వంటి మూగజీవాలు వివిధ కారణాలతో మృతి చెందితే సరైన బీమా సౌకర్యం లేకుండా పోయింది. సీజన్‌లో పలు రకాల వ్యాధులు సోకడం, విద్యుత్, రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతి చెందుతున్న పశువులకు బీమా సౌకర్యం కల్పించి, రైతులను ఆదుకోవాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం అందించే పథకాల్లో కొనుగోలు చేసిన పశువులకు మాత్రమే బీమా చేయిస్తుండగా వ్యక్తిగతంగా వినియోగించే వాటికి ఎలాంటి బీమా లేదు. ఇప్పటికైనా తమకు సరైన అవగాహన కల్పించి, పశువులకు బీమా కల్పించాలని పోషకులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

రైతులకు అవగాహన లేక ఆర్థిక భారంగా భావించి పెంచుకునే పశువులకు బీమా చేయించకుండా తీవ్రంగా నష్టపోతున్నారు. మండల కేంద్రంలో ఏడాదిన్నర కిందట 10 గొర్రెలకు కుక్కకాటు వేయడంతో చనిపోయాయి. దీంతో సుమారు రూ.లక్ష నష్టం వచ్చింది. సరైన అవగహన లేక బాధితుడు గొర్రెలకు బీమా చేయించలేకపోవడంతో నష్టపరిహారం అందలేదు. మూడు రోజుల కింద గుండేపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందింది. బీమా లేక పోవడంతో నష్టపరిహారం అందడంలేదు. మండలంలో 14,816 పశువులు, 30,789 గొర్రెలు, 16,848 మేకలు, 192 పందులు, 11,005 కోళ్లు ఉన్నాయి.



గుండేపల్లిలో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె (ఫైల్)

రైతులు ముందుకు రావాలి



మండలంలో పశువులు కలిగిన ప్రతి రైతు వాటికి బీమా చేయించే అవకాశం ఉంది. వ్యక్తిగతంగా పెంచే పశువులకు ప్రభుత్వం ఎలాంటి బీమా సౌకర్యం కల్పించలేదు. రైతులే ప్రీమియం చెల్లించే ప్రైవేటుగా బీమా చేయించుకునే అవకాశం ఉంది. ప్రమాదాలు వ్యాధులు సోకి మృతి చెందితే ఎలాంటి పరిహారం అందదు.

– వరలక్ష్మి, పశువైద్యాధికారిణి, దౌల్తాబాద్

ఘనంగా శివపార్వతుల కల్యాణం



దుద్యాల్: కల్యాణోత్సవంలో నాయకులు, స్థానికులు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో శివనామ స్మరణలు మార్మోగాయి. సోమవారం గ్రామ శివారులో ఉన్న వీరభద్రేశ్వరస్వామి దేవాలయంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం పార్వతీపరమేశ్వరులకు సంప్రదాయబద్ధంగా వేదమంత్రాలతో కల్యాణం వైభోవంగా సాగింది. ఈ వేడుకకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దుద్యాల్, బొంరాస్‌పేట్ మండలాలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు.



ధారూరు: నందికి పూజలు చేస్తున్న భక్తులు

ధారూరులో రుద్రాభిషేకం

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీ వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో నెలకొన్న కపిలేశ్వరస్వామికి శ్రావణమాసం మూడో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి చెన్నబసవయ్యస్వామి శివలింగాన్ని పాలతో అభిషేకించి, రుద్రాభిషేకం చేశారు. శివలింగాన్ని అలంకరించి హారతి ఇచ్చి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా బొడ్రాయి ఊరేగింపు



కుల్కచర్ల: ముక్తవెంకటపూర్‌లో బోనాలతో మహిళలు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో బొడ్రాయి(నాభిశిల) ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం బొడ్రాయి ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులగుండా చిన్నాపెద్ద, యువకులు కలిసి ఆనందంగా జరుపుకొన్నారు.

మైసమ్మ బోనాల శోభ

కుల్కచర్ల: ముక్తవెంకటపూర్ గ్రామంలో బంగారు మైసమ్మ బోనాలు సోమవారం శోభాయమానంగా జరిగాయి. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలను తయారు చేసి అమ్మవారి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.



బొంరాస్‌పేట: ఊరేగింపులో గ్రామస్తులు

షాక్ కొడుతున్న హైమాస్ట్ స్తంభం

దుద్యాల్: మండల పరిధిలోని వాల్యానాయక్ తండాలో ఇటీవల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్ స్తంభం షాక్ కొడుతుందని స్థానికులు వాపోతున్నారు. మూడు నెలల క్రితం తండాకు హైమాస్ట్ లైట్లను రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేశారు. అప్పట్లో వారం రోజులు మాత్రమే సక్రమంగా పనిచేసిందని, ఆ తరువాత ఆన్ చేస్తే షార్ట్ సర్క్యూట్ అయినట్లు శబ్దం వస్తూ లైట్లు సక్రమంగా వెలగడం లేదని తండావాసులు చెబుతున్నారు. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో లైట్లు ఆన్ చేస్తే ఏకంగా స్తంభానికి షాక్ కొడుతుందని వాపోతున్నారు. దీనిపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్తంభానికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు వీఓఓబీ, వీఓఏలకు శిక్షణ

దోమ: గ్రామ సంఘం పదాధికారులు(వీఓఓబీ), గ్రామ సంఘం సహాయకులకు(వీఓఏ) మంగళవారం సెర్ప్ ఆధ్వర్యంలో నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఏపీఎం శోభ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహిస్తామన్నారు. సామాజిక చేకూర్పు, నూతన స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, విభిన్న ప్రతిభావంతుల సంఘాలు, వయోవృద్ధుల సంఘాలు, కిషోర బాలికల సంఘాల ఏర్పాటుపై శిక్షణ ఉంటుందన్నారు.

చెరువును తలపిస్తున్న రైల్వే బ్రిడ్జి

శంకర్‌పల్లి: సోమవారం కురిసిన వర్షానికి మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి చెరువును తలపించింది. బ్రిడ్జి కింద వర్షపు నీరు వెళ్లేందుకు సరైన మార్గం ఏర్పాటు చేయకపోవడంతో భారీ ఎత్తున వరదనీరు నిలిచింది. దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శోభాయమానంగా ఆరాధనోత్సవాలు



అనంతగిరి: ప్రత్యేక పూజలో పాల్గొన్న మహిళలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో రెండు రోజులుగా ఆరాధన ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. 6గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం గురుపూజ, పల్లకీసేవా నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.



తాండూరు: రాఘవేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలలో భక్తులు

బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో..

తాండూరు: తాండూరు బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యంలో సోమవారం గురు రాఘవేంద్రస్వామి మధ్యారాధన ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. సమాజం అధ్యక్షుడు గురురాజ్‌జ్యోషి ఆధ్వర్యంలో సీతారాంపేట్ పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో నిర్వహించారు. బ్రాహ్మణులు పెద్ద ఎత్తున చేసుకొని ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

కృష్ణమాదిగ సభకు తరలిరండి

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ



పెన్షనర్లతో సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

తాండూరు రూరల్: చేయూత పింఛన్లను పెంచాలనే డిమాండ్ చేస్తూ తాండూరులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ నిర్వహించే సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సంస్థ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్ మాదిగ, ఉపాధ్యక్షులు నర్సిములు మాదిగ కోరారు. ఈ మేరకు సోమవారం మండలంలో కోటబాసుపల్లి గ్రామంలో పెన్షనర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృద్ధులు, వితంతువులకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ పెంచకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఈ నెల 16న నిర్వహించే సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

మంచి నడవడికతోనే గుర్తింపు

కుల్కచర్ల: క్రమశిక్షణ, వ్యక్తిగత నడవడికతోనే వ్యక్తులకు గుర్తింపు, గౌరవం లభిస్తాయని కుల్కచర్ల బాలుర ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి సుందర్ రాజ్ అన్నారు. సోమవారం పాఠశాలలో విద్యార్థులకు సమాజంలో ఏ విధంగా ఉండాలి, వ్యక్తిగత ప్రవర్తనను ఎలా మెరుగుపరుచుకోవాలని అనే అంశాలపై బాయ్స్ ఫర్ చేంజ్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పదిరోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ చిన్న వయసులోనే సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కార్తీక్ రమణసాయి, రిత్విక్, చరణ్, హర్షవర్ధన్ పటేల్, ప్రణీత్‌పాల్, సంజయ్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజేందర్, గోపాల్, సతీష్, రమేష్, రాములు, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఉపాధ్యాయులు, సంస్థ ప్రతినిధులు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో కాంగ్రెస్ పార్టీ నాయకులు

మోమిన్‌పేట: పేదలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.17 లక్షల విలువగల చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలు అనారోగ్యానికి గురైతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సీఎంఆర్‌ఎఫ్‌తో చికిత్సకు అవసరమున్న నిధులు ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్, సుభాష్‌గౌడ్, సిరాజోద్దీన్, చంద్రయ్య, గిరిసింగ్, మోతిలాల్ , నరోత్తంరెడ్డి, ఎజాస్ పాల్గొన్నారు.

రైతులు నేరుగా అర్జీలు ఇవ్వాలి



తాండూరు రూరల్: రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ

ఇన్‌చార్జ్ ఏడీఏ కొమురయ్య

తాండూరు రూరల్: రైతు బీమా కోసం అన్నదాతలు నేరుగా వచ్చి కార్యాలయంలో ఏఈఓలకు దరఖాస్తులు ఇవ్వాలని తాండూరు వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ ఏడీఏ కొమురయ్య సూచించారు. సోమవారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతుల నుంచి బీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కొమురయ్య మాట్లాడుతూ.. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వయసున్న రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. తాండూరు డివిజన్‌లో 33 వేల మంది రైతులు అర్హులని చెప్పారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో సంబంధిత ఏఈవోలకు అందజేయాలని సూచించారు. ఈ నెల 13వ తేదీలోపు సంబంధిత రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.



కొడంగల్: దరఖాస్తులు తీసుకుంటున్న ఏఓ తులసీ

రైతు వేదికల్లో అవగాహన

కొడంగల్: మండల పరిధిలో కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి తులసీ చెప్పారు. సోమవారం మండల పరిధిలోని అంగడిరాయిచూర్, పర్సాపూర్ గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల రైతు వేదికల దగ్గర రైతులకు అవగాహన కల్పించారు. నామినీ పేరు మార్పిడి కోసం ఈ నెల 12వ తేది వరకు, కొత్తగా పేరు నమోదు చేసుకోడానికి 13వ తేది వరకు అవకాశం ఉందన్నారు.

దరఖాస్తు చేసుకోండి

యాలాల: రైతు బీమా పథకానికి రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్వేతారాణి కోరారు. భూమి ఉన్నప్పటికి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు, కొత్తగా భూములు కొనుగోలు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

చేవెళ్ల: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఏబీవీపీ శంషాబాద్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ అన్నారు. మండలంలోని వివేకానంద కళాశాలలో సోమవారం ఏబీవీపీ నగర కార్యదర్శి కుర్వ మహిపాల్ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశం నిర్వహించి.. నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఏబీవీపీ ఏర్పడిన 75 సంవత్సరాల కాలంగా విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ.. అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎదిగిందన్నారు. చేవెళ్ల నగర అధ్యక్షుడిగా శివకుమార్ ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

నులి పురుగులను నులిమేద్దాం

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: నులిపురుగుల నివారణతో విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణ కేంద్రంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 19 ఏళ్ల లోపు ఉన్న చిన్నారులు, యువత తప్పనిసరిగా మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. విద్యార్థులు ఇంట్లో తమ పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించేందుకు తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. పాఠశాల ఆవరణలో సీసీ రోడ్డుకు రూ.7లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పరిగి–లక్నాపూర్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి

తాండూరు టౌన్: రక్తహీనతతో పాటు ఇతర అనారోగ్య పరిస్థితులకు కారణమైన నులిపురుగులను మాత్రలతో నులిమేయాలని పట్టణ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. సోమవారం జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్య సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగదేవి, ఎఎన్ఎం శాంత, ఆశా వర్కర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.



పరిగి: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే టీఆర్ఆర్

నులి పురుగులుంటే అనార్థమే

దుద్యాల్: పిల్లల శరీరంలో నూలి పురుగులు ఉత్పన్నమైతే అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని హకీంపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వందన, దుద్యాల్ సబ్ సెంటర్ వైద్యురాలు విద్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెట్టుపల్లి తండా కేజీబీవీలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయరామారావు, ప్రధానోపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

కుల్కచర్ల/దోమ: విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని బాలికల జెడ్పీ పాఠశాలలో వైద్యాధికారి కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంఈఓ హబీబ్ అహ్మద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మూలనే లక్ష్యంగా..

దౌల్తాబాద్: బాల బాలికల్లో నులి పురుగుల సమస్య నిర్మూలనే లక్ష్యంగా ఏటా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తుందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి ప్రియదర్శిని అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మాత్రలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రఫీ, ఏఎన్ఎంలు ఉన్నారు.



దుద్యాల్: కేజీబీవీలో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్లు

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: అపరిశుభ్రమైన, కలుషిత ఆహారంతో జీర్ణ వ్యవస్థను దెబ్బతీసే నులిపురుగుల పట్ల అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రేగడిమైలారం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుపై అవగాహన కల్పించారు. ఆల్బెండజోల్ మాత్రలు వాడాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గోపాల్, అంగన్‌వాడీ కార్యకర్త భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బంట్వారం, కోట్‌పల్లిలో..

బంట్వారం: ఆల్బెండజోల్ మాత్రలతో నులిపురుగులను నివారిద్దామని బంట్వారం, కోట్‌పల్లి పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు మజీద్‌ఖాన్, మేఘన అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం ఆయా పాఠశాలల్లో వైద్య బృందం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రప్ప, వెంకటేశ్వర్‌రావు, సీహెచ్ఓలు విజయ్ కుమార్, ఖయాం, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి